సాక్షి
కర్నూలు
సోమవారం ¦ 10 ¦ జూలై ¦ 2023



భ్రామరీకి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం నంద్యాలకు చెందిన విష్ణువర్ధన రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: మల్లన్నను దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి.

న్యూస్‌రీల్

రాజగోపురానికి రూ. లక్ష విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి ఆదివారం గూడూరుకు చెందిన గాజుల మల్లికార్జున కుటుంబం రూ. రూ.1,01,116ను విరాళంగా అందజేసింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ దాతను అభినందించి స్వామి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

27 కాలేజీలకు షోకాజ్ నోటీసులు

కర్నూలు సిటీ: నిబంధనలు పాటించని జూనియర్ కాలేజీలకు ఇంటర్మీడియెట్ బోర్డు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని పలు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కానీ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని 27 కాలేజీలకు ఇంటర్ బోర్డు రాష్ట్ర కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు జారీ కావడం గమనార్హం. వారం రోజుల్లో నోటీసులకు సమాధానం ఇవ్వాలని పొందుపర్చినట్లు సమాచారం.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పాట్ బిల్లింగ్ పూర్తి చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ స్పాట్ బిల్లింగ్‌ను పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 10 తేదీ నాటికి ఎక్కడా పెండింగ్‌లో లేకుండా స్పాట్ బిల్లింగ్ చేపట్టి, వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు.

సెక్టోరియల్ పోస్టుల దరఖాస్తుకు నేడు ఆఖరు

కర్నూలు(సిటీ): సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లుగా డిప్యుటేషన్ పద్ధతిలో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకునే గడువు నేటితో ముగియనుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7వ తేదీతో దరఖాస్తు గడువు ముగిసింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డైట్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్ టీచర్లు అర్హులు. దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అన్ని విద్యార్హత సర్టిఫికెట్లపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేసి సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలి.

నల్లమలలో వేటగాళ్లు

ఆళ్లగడ్డ: అహోబిలం సమీపంలోని నూతల నార్త్‌బీట్‌లో కొందరు వేటగాళ్లు శనివారం అర్ధ రాత్రి నాటు తుపాకీతో ఓ జింకను వేటాడారు. చనిపోయిన జింకను కర్రలకు కట్టుకుని అహోబిలానికి తరలిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో దాడి చేశారు. అటవీ అధికారులను చూసి జింక కళేబరాన్ని అక్కడే పడేసి వేటగాళ్లు పారిపోయారు. మృతి చెందిన జింకను గుట్టుచప్పుడు కాకుండా అధికారులు ఎగువ అహోబిలం సమీపంలోని బేష్ క్యాంప్ దగ్గరకు తరలించారు. విషయం బయటకు పొక్కకుండా ఆదివారం ఉదయం రుద్రవరం పశువైద్యాధికారిని అడవిలోకి తీసుకెళ్లి జింకకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కేసులో అహోబిలానికి చెందిన ఐదుగురిని, హరినగరానికి చెందిన నలుగురు అనుమానితులను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై అటవీ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా దాట వేస్తున్నారు. పూర్తి సమాచారం అందిన తర్వాతనే వెల్లడిస్తామని చెబుతున్నారు.

పెట్టుబడి తగ్గి.. నాణ్యత పెరిగి!

మల్చింగ్ సాగుకు ఆదరణ

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వెయ్యి హెక్టార్లలో వినియోగం
- హెక్టారుకు యూనిట్ కాస్ట్ రూ.32 వేలు.. 50 శాతం సబ్సిడీ
- పంటను బట్టి 25 నుంచి 100 మైక్రాన్స్‌ల మందం ప్లాస్టిక్ షీట్‌లు
- కలింగర, కర్బూజ, బొప్పాయి, ఉల్లి, టమాట పంటల్లో మేలైన దిగుబడులు



వెల్దుర్తి మండలం సూదేపల్లిలో మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన నన్నారి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖలో సాంకేతికత పెరుగుతోంది. పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకొని నాణ్యమైన దిగుబడులు సాధించి రైతులు నికర ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందుకు సబ్సిడీలను ఇచ్చి ప్రోత్సహిస్తోంది. జిల్లాలో అన్ని రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇటీవల కాలంలో ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ పట్ల ఆదరణ పెరుగుతోంది. మొక్కల చుట్టూ నేలను ఏదైనా పదార్థంతో కప్పిపెట్టడాన్ని మల్చింగ్‌గా వ్యవహరిస్తారు. పూర్వం మల్చింగ్‌కు వరిపొట్టు, రంపం పొట్టు, చెరుకు పిప్పి, ఎండిన ఆకులు తదితరాలను వినియోగించారు. ప్రస్తుతం ప్లాస్టిక్‌తో మల్చింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఉద్యాన శాఖ 50 శాతం రాయితీతో రైతులకు మల్చింగ్ సదుపాయం కల్పిస్తుండటం విశేషం. అన్ని రకాల కూరగాయల పంటలు, కలింగర, టమాట, కర్బూజ, బొప్పాయి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమాట, ఉల్లి తదితర పంటల సాగులో మల్చింగ్ అనువుగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

1000 హెక్టార్లలో మల్చింగ్ సదుపాయం

జిల్లాలో గత నాలుగైదేళ్లుగా మల్చింగ్ సదుపాయంతో ఉద్యాన పంటలు సాగు చేయడం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 1000 హెక్టార్లలో మల్చింగ్ సదుపాయంతో రైతులు రాణిస్తున్నారు. హెక్టారు పొలంలో మల్చింగ్ సదుపాయానికి యూనిట్ కాస్ట్ రూ.32వేలు అవుతుంది. ఉద్యానశాఖ ఇందులో 50 శాతం అంటే రూ.16వేలు సబ్సిడీ ఇస్తోంది. గరిష్టంగా రెండు హెక్టార్లకు సబ్సిడీ వర్తిస్తుంది. మల్చింగ్ కోసం తీగజాతి కూరగాయల సాగుకు 20-25 మైక్రాన్‌లు, పండ్లతోటలకు 40-60 మైక్రాన్‌లు, బొప్పాయ ఇతర కూరగాయలకు 70-80 మైక్రాన్‌ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్ వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ షీట్లు 3 నుంచి 4 అడుగుల వెడల్పుతో.. బ్లాక్ అండ్ వైట్, బ్లాక్ అండ్ సిల్వర్‌లో లభిస్తున్నాయి. పంటను బట్టి ప్లాస్టిక్ షీట్లకు రంధ్రాలు వేసుకొని విత్తనాలు లేదా నారు నాటుకోవాలి. కర్నూలులోనే మల్చింగ్‌కు వినియోగించే ప్లాస్టిక్ తయారీ పరిశ్రమ కూడా అందుబాటులో ఉండటం విశేషం. ఈ పరిశ్రమ ద్వారా ఏటా లక్ష నుంచి 2 లక్షల రోల్స్ విక్రయిస్తున్నారంటే మల్చింగ్ పట్ల రైతులు ఏ స్థాయిలో ఆసక్తి చూపుతున్నారో అర్థమవుతోంది.

మల్చింగ్‌తో నాణ్యమైన దిగుబడులు

ఉద్యాన పంటలన్నిటికీ మల్చింగ్ సదుపాయం కల్పించడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ఉద్యాన అధికారులు స్పష్టం చేస్తున్నారు. మొక్కలకు వాటి జీవితకాలమంతా అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు కలుగుతుండటం వల్ల పంట ఏపుగా పెరిగి మంచి నాణ్యతతో కూడిన దిగుబడులు పొందవచ్చు. భూమిలో తేమ ఎప్పుడూ నిల్వ ఉండటం వల్ల నేల గుల్లబారి వేరు వ్యవస్థ దృఢంగా వృద్ధి చెందుతుంది. దీని వల్ల నీరు, ఎరువులు, భూమి లోపలి పొరలో ఉండి మొక్కలకు అధికంగా లభ్యమవుతాయి.

మల్చింగ్ వినియోగంతో లాభాలు

- మొక్కచుట్టూ భూమిలో తేమ ఆవిరికాకుండా నివారించడం వల్ల 40-50 శాతం నీరు ఆదా అవుతుంది.
- సూర్యరశ్మి నేరుగా కలుపు మొక్కలకు అందే అవకాశం లేనందున 85 శాతం వరకు కలుపు నివారణ.
- మొక్క చుట్టూ నేల ఉష్ణోగ్రతలను నియంత్రించే అవకాశం.
- భూమిలోని చీడపీడల నియంత్రణ.
- ఎరువులు భూమి లోపలి పొరలోకి వెళ్లకుండా నివారించడం వల్ల కలుపు నివారణ, క్రిమి సంహారక మందుల ఆవశ్యకత తగ్గి ఎరువులతో పాటు పురుగు మందులు ఆదా.

కలుపు మొక్కలకు అవకాశమే లేదు



నాలుగు ఎకరాల్లో నన్నారి సాగు చేస్తున్నా. ఇందులో రెండు ఎకరాలు మల్చింగ్ సదుపాయంతో సాగవుతోంది. నేలలో తేమ ఆరిపోదు. కలుపు మొక్కలు వచ్చే అవకాశం లేదు. ఇందు వల్ల నీరు ఆదా అవుతోంది. మల్చింగ్ సదుపాయానికి ఉద్యాన శాఖ నుంచి హెక్టారుకు రూ.16వేల సబ్సిడీ కూడా వచ్చింది. ఉద్యాన పంటలను మల్చింగ్ పద్ధతిలో సాగు చేయడం చాలా ఉత్తమం. – రాఘవరెడ్డి, సూదేపల్లి గ్రామం, వెల్దుర్తి మండలం



మల్చింగ్ పద్ధతిలో ఉల్లి సాగు

మల్చింగ్ సదుపాయాన్ని ప్రోత్సహిస్తున్నాం



ఏడాదికేడాది మల్చింగ్ వినియోగం పెరుగుతోంది. పంటలకు తగిన మైక్రాన్‌ల మందం కలిగిన ప్లాస్టిక్ షీట్లనే వినియోగించాలి. జిల్లాలోఎక్కువగా కలింగర, కర్బూజ, టమటా, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బొప్పాయి ఇతర కూరగాయల పంటల సాగుకు మల్చింగ్ అనుకూలం. ఈ సదుపాయంతో ఉద్యాన పంటల సాగు ఎంతో మేలు. నేలలో తేమ ఎక్కువ నిల్వ ఉంటుంది. కలుపు సమస్య బాగా తగ్గుతుంది.– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ జి.క్రిష్ణకాంత్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ క్రిష్ణకాంత్

కర్నూలు(టౌన్): ట్రాఫిక్ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తప్పవని, సమష్టి కృషితో రోడ్డు ప్రమాదాలను నియంత్రిద్దామని జిల్లా ఎస్పీ జి.క్రిష్ణకాంత్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ చేపట్టిన స్పెషల్‌డ్రైవ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు తీసుకున్న చర్యలను ఎస్పీ వివరించారు.

- డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 3,506 కేసులు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 37,483 కేసులు.. మైనర్లపై 303 కేసులు, వన్‌వేలో రాంగ్ రూట్‌లో వెళ్తున్న వారిపై 1,393 కేసులు, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపిన 1,716 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.
- ఎలాంటి రికార్డులు, పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారిపై 64,926 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళుతున్న కార్లు, జీపులు తదితర వాహన చోదకులపై 4,127 కేసులు, అతివేగంతో వెళ్లిన వాహనాలపై 12,214 కేసులు నమోదు అయ్యాయన్నారు.
- అలాగే ట్రిబుల్ రైడింగ్‌పై 6,612 కేసులు, ఓవర్ లోడ్ కింద 1,819 కేసులు.. రాంగ్ పార్కింగ్‌పై 4,230 కేసులు, నంబర్ ప్లేట్ లేని వాహనాలపై 2,536 కేసులు, డ్రంకన్ డ్రైవ్‌పై 819 కేసులు నమోదు చేశామన్నారు.
- ఈ -చలనాలు 5.59 లక్షలు పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటి వరకు 1,55,947 చలానాల ద్వారా రూ.3.6 కోట్లు రికవరీ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.



మఠం ముందు భాగంలో భక్తుల రద్దీ

శ్రీమఠంలో భక్తజన సందడి



ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రస్వామి మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవంపై ఉంచి శ్రీ మఠం మాఢ విధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పీఏసీఎస్‌లను లాభాల బాట పట్టిస్తాం

బహుళ సేవా సంఘాలుగా పీఏసీఎస్‌ల అభివృద్ధి

- రాష్ట్రంలోనే 5వ అతిపెద్ద బ్యాంకుగా కర్నూలు డీసీసీబీ
- షేర్ క్యాపిటల్‌పై 2 శాతం వడ్డీ రూ.3.90 కోట్లు విడుదల
- డీసీసీబీ లాభాల నుంచి రూ.71 లక్షల డివిడెండు పంపిణీ
- మహాజనసభలో కేడీసీసీబీ ఛైర్‌పర్సన్ మహాలక్ష్మి



రూ.3.90 కోట్ల మెగా చెక్ విడుదల చేస్తున్న డీసీసీబీ ఛైర్‌పర్సన్ మహాలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను లాభాల బాట పట్టిస్తామని, త్వరలోనే అన్ని సంఘాలను మల్టీ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తామని జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఛైర్‌పర్సన్ ఎస్.మహాలక్ష్మి తెలిపారు. ఇప్పటికే 70 సంఘాలు రూ.10కోట్లకుపైగా వ్యాపారంతో ఏ కేటగిరిలో ఉండటం అభినందనీయమన్నారు. ఆదివారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు మహాజనసభ కేడీసీసీబీ ఛైర్ పర్సన్ అధ్యక్షతను స్థానిక హరిత(పున్నమి) గెస్ట్ హౌస్‌లో నిర్వహించారు. పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు, సీఈఓలు పాల్గొన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఉన్న 99 పీఏసీఎస్‌ల షేర్ క్యాపిటల్‌పై మొదటిసారి 2 శాతం వడ్డీ ప్రకారం రూ.3.90 కోట్లు విడుదల చేస్తూ మెగా చెక్‌ను ఆవిష్కరించారు. 2022-23లో జిల్లా సహకార కేంద్రబ్యాంకుకు వచ్చిన లాభాల నుంచి పీఏసీఎస్‌లకు రూ.71 లక్షల డివిడెండును కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రస్తుతం రూ.3,500 కోట్లతో రాష్ట్రంలోనే 5వ అతి పెద్ద బ్యాంకుగా అవతరించిందన్నారు. 2023-24లో జిల్లా సహకార కేంద్రబ్యాంకు టర్నోవర్ రూ.4,500 కోట్లకు తీసుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు మట్లాడుతూ సహకార సంఘాల ద్వారా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫంక్షన్ హాళ్లు, రైస్ వ్యాపారం, పెట్రోల్ పంపులు, టింటు హౌస్‌లు, సూపర్ బజార్లు, గోల్డ్‌లోన్ వ్యాపారం అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. 12,562 మంది రైతులకు వివిధ పథకాల కింద రూ.663 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం దాదాపు మూడేళ్లుగా జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ప్యాక్ డెవలప్‌మెంటు మేనేజర్‌గా పని చేస్తూ గుంటూరు జిల్లా ఏటీ అగ్రహారం ఆప్కాబ్ బ్రాంచ్‌కు బదిలీ అయిన బరద్వాజశర్మను జిల్లా సహకార కేంద్రబ్యాంకు పాలక వర్గంతో పాటు పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు, సీఈఓలు సత్కరించారు. పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకటేశ్వరమ్మ, మూలింటి రాఘవేంద్ర, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి డీసీవో వెంకటకృష్ణ, డీసీసీబీ డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్



పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

- మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో నిర్వహణ
- ఒకే రోజు 228 పోస్టులు పదోన్నతులతో భర్తీ

కర్నూలు(సిటీ): ఇటీవల వాయిదా పడిన టీచర్ల పదోన్నతుల కౌన్సెలింగ్ ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సెకెండ్ గ్రేడ్ టీచర్లతో భర్తీ చేశారు. టౌన్ మోడల్ హైస్కూల్‌లో డీఈఓ డా.వి. రంగారెడ్డి, ఏడీ శ్యామూల్‌పాల్ పాల్గొని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కో సబ్జెక్టుకు వేర్వేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో మొత్తం 228 పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 5వ తేదీన బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పోస్టుల పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిని రద్దు చేశారు. గతంలో(మే, జూన్ నెలల్లో) సీనియారిటీ జాబితాల్లో ఏ నెంబర్ వరకు పదోన్నతులు నిలిచిపోయాయో ఆ తర్వాత ఉండే వారి నుంచి మెరిట్ కమ్ రోస్టర్‌తో తయారు చేసిన జాబితాల ఆధారంగా పదోన్నతులు చేపట్టారు. ఇందులో బయాలజీ (తెలుగు మీడియం) 39, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 48, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 33, స్కూల్ అసిస్టెంట్ సోషల్ (తెలుగు మీడియం) 82, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉర్దూ 6, స్కూల్ అసిస్టెంట్ సోషల్ (కన్నడ మీడియం) 1, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ తెలుగు మీడియం 19 పోస్టులను భర్తీ చేశారు.

13న శ్రీహరి కోటకు ప్రత్యేక బస్సు

- చంద్రయాన్-3 ఉపగ్రహ ప్రయోగాన్ని తిలకించేందుకు ఏసీ సర్వీసు

కర్నూలు(రాజ్‌విహార్): చంద్రయాన్-3 ఉపగ్రహ ప్రయోగాన్ని తిలకించేందుకు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు కర్నూలు-1 డిపో మేనేజరు కె. సుధారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీన ఇంద్ర ఏసీ బస్సును (సర్వీసు నంబర్-93633) ప్రత్యేక సర్వీసుగా నడపుతున్నామని, దారిలో శ్రీ కాళహస్తి (వాయు లింగం), వరదయ్యపాళెంలో కల్కి ఆశ్రమం (ప్రత్యేక ధ్యాన శిక్షణ కార్యక్రమం), సుళ్లూరు పేటలోని చెంగాలమ్మ గుడి, సినీ హీరో ప్రభాస్ నిర్మించిన ఆసియాలోనే అతిపెద్ద స్క్రీన్ (106 అడుగుల వెడల్పు తెర) వి ఎపిక్ సినిమా థియేటర్‌లను చూసే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఈ బస్సు కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి నంద్యాల, తిరుపతి మీదుగా శ్రీహరికోట చేరుకుంటుందని, తిరిగి 15న ఉదయం 9 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. చార్జీ రూ.2,500 ఉంటుందని, ముందస్తుగా టికెట్ పొందేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌తో పాటు అధికృత డీలర్లు, నెట్ సెంటర్లలో టికెట్లు పొందవచ్చని తెలిపారు. అయితే, చంద్రయాన్ ప్రదర్శను ప్రత్యక్షంగా తిలకించేందుకు శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోకి వెళ్లేందుకు ముందస్తుగా వెబ్‌సైట్ https://lvg.shar.gov.in/VSCREGISTRATION/index.jspలో పేరు, ఆధార్ నంబరుతో రిజిస్టర్ చేసుకుంటే అనుమతి లభిస్తుందని, అప్పుడే లోపలికి అనుమతిస్తారని వెల్లడించారు.

రేపు విద్యుత్ సీఎండీ రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు ఈనెల 11వ తేదీన కర్నూలుకు రానున్నారు. కర్నూలు, నంద్యాల విద్యుత్ డివిజన్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్, కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎంఅండ్‌పీ, కన్‌స్ట్రక్షన్స్ విభాగాలు, అకౌంట్స్ ఆఫీసర్లతో సమావేశం కానున్నారు.

189 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాలకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు ఆదివారం తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, డ్యాంలో 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పత్తికొండటౌన్: బైక్‌ను ఆటో ఢీకొని ఆదివారం ఉదయం ఒకరు మృతిచెందారు. పత్తికొండ పట్టణంలోని ఆదోని రోడ్డులో పుష్ప హాస్పిటల్ ఎదురుగా ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆలూరు మండలం మరకట్టు గ్రామానికి చెందిన బేగారి చలువప్ప (34) పత్తికొండలో సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆదోనిరోడ్డులో పనులు చూసేందుకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పుష్ప హాస్పిటల్ ఎదురుగా ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో చలువప్ప తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

బొమ్మలసత్రం: చాబోలు గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తాలూకా ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. చాబోలు గ్రామానికి చెందిన మదార్‌సా (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. పట్టణంలో పని ముగించుకొని బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా జాతీయరహదారి దాటుతున్న సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉడుములపాడు సమీపంలో..

డోన్ టౌన్: ఉడుములపాడు గ్రామ సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన యువకుడు మహేష్ (28) దుర్మరణం చెందాడు. ఉడుములపాడు గ్రామ సమీపంలోని ఆగ్రిసోల్ అనే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న మహేష్ విధులు ముగించుకొని తిరిగి పట్టణానికి బైకుపై వస్తుండగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన మినీ ఐచర్ వాహనం కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళుతూ అదుపు తప్పి బైకును వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య శాంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి విజయుడు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన మహేష్

108లోనే ప్రసవం


శిశువును చూపుతున్న ఈఎంటీ రంగస్వామి

ఆలూరు రూరల్: అంబులెన్స్‌లో ఓ గర్భిణి సుఖ ప్రసవమైంది. వివరాల్లోకి వెళితే.. హొళగుంద మండలం కోగిలతోట గ్రామానికి చెందిన సిద్దమ్మ అనే గర్భిణికి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో భర్త మల్లేష్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. వెంటనే హొళగుంద 108 గ్రామానికి చేరుకుని గర్భిణిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో ఆమెకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రంగస్వామి వాహనం నిలిపివేసి సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వైద్యసేవల నిమిత్తం వారిని హొళగుంద ఆస్పత్రిలో చేర్పించినట్లు ఈఎంటీ తెలిపారు. సిద్దమ్మది ఇది రెండో కాన్పు. ఫోన్ చేయగానే 108 అంబులెన్స్ రావడం పట్ల మహిళ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధి.. వడివడిగా..!

- జిల్లాలో 70 లక్షల పనిదినాల లక్ష్యం
- నాలుగు నెలల్లోనే 55.65 లక్షల పనిదినాలు పూర్తి
- రూ. 240 సగటు వేతనం
- రైతులకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యత
- ప్రధాన కాల్వలు, అమృత సరోవర్ చెరువుల్లో పూడిక తీత పనులు

కోవెలకుంట్ల: జిల్లాలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథక పనులు వడివడిగా జరుగుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 4.38 లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 8.70 లక్షల మంది కూలీలు ఉన్నారు. 1.50 లక్షల కుటుంబాల్లోని 2.55 లక్షల మంది కూలీలు ఉపాధి పనులకు వెళుతున్నారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఆయా మండలాల్లో 70 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందు కోసం రూ. 335 కోట్ల లేబర్ (కూలీల వేతనం, మెటీరియల్ కలిపి) బడ్జెట్ కేటాయించారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే పనులు వేగవంతమయ్యాయి. వేసవికాలంలో వ్యవసాయ పనులు ఉండకపోవడం, చెరువులు, కుంటలు, పంట కాల్వల్లో నీరులేక ఎండిపోవడంతో వాతావరణం ఉపాధి పనులకు అనుకూలంగా మారింది. ఏప్రిల్ నుంచి జూలై మొదటి వారం వరకు రోజుకు 1.05 లక్షల మందికి పనులు కల్పించారు. దీంతో ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నాలుగు నెలలకే 55.65 లక్షల పనిదినాలు పూర్తి అయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ పొలాలకు రహదారులు, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, కుంటలు, చెరువులు, బావుల్లో పూడికతీత, కొత్తగా పంట కాల్వలు, కొండ ప్రాంతాల్లో నీరు నిల్వ చేరే పనులు, ఉద్యానవన శాఖ పరిధిలో మామిడి, నిమ్మ, సపోట, జామ, తదితర పండ్ల తోటల పెంపకం, తదితర పనులు చేస్తున్నారు. రైతుల అవసరాలకనుగుణంగా ఆయా పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఉపాధిలో 20 రకాల పనులు మాత్రమే చేసేలా నిబంధన విధించారు. ఈ పనులు కాకుండా మరో పని ఎంచుకుంటే 20 పనుల్లో ఒక పనిని ఆన్‌లైన్‌లో తొలగించి కొత్తగా ఎంపిక చేసిన పనిని నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఉపాధి పథకంలో ఎలాంటి అవకతవకలు, బినామీ మస్టర్లకు తావు లేకుండా హాజరు విధానాన్ని పకడ్బందీ చేశారు. మస్టర్‌లో అటెండెన్స్ వేసిన వెంటనే సెల్‌లో ప్రత్యేక యాప్ ద్వారా పని ప్రదేశంలో కూలీలఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. పని ప్రారంభమయ్యాక నాలుగు గంటల తర్వాత అదే కూలీలనుసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో ఉపాధిలో అక్రమాలకు చెక్ పడినట్లు అయింది.


కోవెలకుంట్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వంద పనిదినాల కల్పనపై దృష్టి..

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో వంద పనిదినాల లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి వీలైనన్నీ ఎక్కువ కుటుంబాలకు వంద పనిదినాలు కల్పించే దిశగా అధికారులు కసరత్తుచేస్తున్నారు. ఆయా మండలాల్లో ఇప్పటికే 45వేల కుటుంబాలకు 50 రోజులకు పైగా పనిదినాలు పూర్తి చేసుకున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరునాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో వీలైనన్నీ ఎక్కువ కుటుంబాలు ఆ జాబితాలో చేరుతాయని ఉపాధి పథక అధికారులు పేర్కొంటున్నారు. రోజుకు ఒక్కో కూలీకి రూ. 272 గరిష్ట వేతనం నిర్ధేశించగా రూ. 240 సగటు వేతనం అందుతోంది. గత నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా వ్యవసాయ పనులకు ఇబ్బంది లేకుండా మరో వైపు ఉపాధి పనులు కొనసాగుతున్నాయి.

93 పని దినాలు పూర్తి చేసుకున్నాం



భార్య, భర్తలం ఇద్దరం ఉపాధి పనులకు వెళుతూ ఈ ఏడాది ఇప్పటికే 93 పనిదినాలు పూర్తి చేసుకున్నాము. వేసవికాలంలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులు కల్పించారు. రోజుకు రూ. 240 చొప్పున వేతనం అందింది. వందరోజులే కాకుండా ఈ ఏడాది నుంచి అదనంగా పనిదినాలు కల్పించాలి.
– రాజు, ఉపాధి కూలీ, గుంజలపాడు

ప్రణాళికా బద్ధంగా ఉపాధి పనులు



కోవెలకుంట్ల క్లస్టర్‌లోని ఏడు మండలాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 20 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్ధేశించారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయి. ఉపాధి పథకంలో రైతులకు ఉపయోగ పడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అమృత సరోవర్ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి లక్ష్యాన్ని అధిగమిస్తాం.
– సాంబశివరావు, ఉపాధి పథక ఏపీడీ, కోవెలకుంట్ల

మహానందిలో సండే సందడి

మహానంది: మహానందిలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దేవస్థానానికి చెందిన వసతి గృహాలన్ని నిండిపోయాయి. దీంతో ప్రైవేటు లాడ్జీల యజమానులు ఇదే అదనుగా భావించి సాధారణ రోజుల కంటే అధికంగా వసూలు చేసి భక్తులను దోచుకున్నారు. సాధారణ రోజుల్లో కేవలం రూ. 300 నుంచి రూ. 400కు ఇచ్చే గదులను రద్దీ నేపథ్యంలో రూ. 1000 వరకు పెంచి వసూలు చేశారు. దేవస్థానం, పంచాయతీ అధికారులు స్పందించి నంద్యాల, కర్నూలు పట్టణాల తరహాలో నిర్ణీత ధరలు వసూలు చేసేలా బోర్డులు ఏర్పాటు చేయించాలని సుదూర ప్రాంతాల భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.


మహానందీశ్వరుడి దర్శనార్థం క్యూలో భక్తులు

వివాహిత ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో ఆదివారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన బోయ వెంకటేశులుకు 10 సంవత్సరాల క్రితం గోనెగండ్ల మండలం గంజెళ్ల గ్రామానికి చెందిన బోయ ఈరమ్మతో వివాహమైంది. వీరికి అంజలి(8), ఉదయ్(6) ఇద్దరు సంతానం. భార్యాభర్తలిద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా శనివారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. ఆదివారం ఉదయం వేపకాయలు వేరుకునేందుకు వెంట భార్యను తీసుకెళ్లకుండా ఒక్కడే వెళ్లాడు. తీవ్ర మనస్తాపం చెందిన బోయ ఈరమ్మ ఇంట్లో ఉన్న పురుగు ముందు తాగింది. పిల్లలకు కూడా ఆ మందు తాపటానికి ప్రయత్నించగా కేకలు వేసుకుంటూ బయటకు వెళ్లి ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పారు. హుటాహుటిన వారు ఈరమ్మను చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకున్న భర్త, బంధువులు ఇంటికి చేరుకుని బోరున విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.


మృతి చెందిన బోయ ఈరమ్మ

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

దొర్నిపాడు: వ్యవసాయ రంగానికి పగలే 9 గంటలు, గృహ అవసరాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందజేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఆదివారం దొర్నిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని 5ఎంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పోవడంతో ఎస్ఈ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామస్తులకు ఎటువంటి విద్యుత్ సమస్యలేకుండా చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేసి, అధికారుల పనితీరును అభినందించారు. ఆయన వెంట డీఈలు రమణారెడ్డి, లతా, ఏడీలు సుభాష్, చారీ, ఖాజావలీ, లైన్ ఇన్‌స్పెక్టర్ కుక్కలయ్య, లైన్‌మేన్‌లు శ్రీనివాసరెడ్డి, నాగన్న తదితరులు ఉన్నారు.


విద్యుత్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఈ

ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 8,9 తేదీల్లో జరిగిన 8వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్–2023లో జిల్లాకు చెందిన స్విమర్స్ ప్రతిభ కనపరిచారు. ఒక బంగారు పతకం, ఏడు సిల్వర్, ఆరు బ్రాంజ్ పతకాలు కైవసం చేసుకున్నారు. 50 మీటర్స్ బటర్ ఫ్లైలో షేక్ సామియా తంజీమ్ ఒక బంగారు, నాలుగు సిల్వర్ పతకాలు, దేవ్ శ్రుత్ సై సాయి మూడు సిల్వర్, రెండు బ్రాంజ్ పతకాలు, పి. హేమలత ఒక బ్రాంజ్ పతకం, వెర్నిక ఒక బ్రాంజ్‌పతకం, కె. మనోజ్ ఒక బ్రాంజ్‌పతకం, కె. శ్రుతి రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ పతకాలు సాధించారు. ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆదివారం స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ఎంపీటీసీ సభ్యురాలి మృతి

వెలుగోడు: అబ్దుల్లాపురం ఎంపీటీసీ సభ్యులు కనకమ్మ(50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. 2021 సెప్టెంబర్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీటీసీగా గెలుపొందిన కనకమ్మ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆమెకు భర్త రామయ్య, నలుగురు కుమారులు సంతానం. కనకమ్మ అకాల మరణం పట్ల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కనకమ్మ పార్థివ దేహానికి ఎంపీపీ లాలం రమేష్, వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ రాజేష్, బాషా, రైతు సంఘం ప్రెసిడెంట్ రమణ, వైఎస్ఆర్‌సీపీ మండలం నాయకులు, కార్యకర్తలు కనకమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

వెల్దుర్తి: ఇంటిపై నుంచి కిందికి దిగే క్రమంలో ప్రమాదవశాత్తు మెట్లపై జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వెల్దురి బీసీ బాలికల గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్న గిడయ్య (40) ప్రతిరోజు లాగే శనివారం తన ఇంటిపై నిద్రించాడు. ఉదయం కిందికి దిగి వస్తుండగా మెట్లపై నుంచి జారి పడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడి సోదరుడు ఎల్లకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీహెచ్‌సీకి తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గిడ్డయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.


గిడ్డయ్య (ఫైల్)


ఎన్టీఆర్ పాటకు నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆకట్టుకున్న నృత్యోత్సవం

- ఎన్టీఆర్ పాటలకు 10 గంటల పాటు నిర్విరామ నృత్య ప్రదర్శన
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో నమోదు

కర్నూలు(సెంట్రల్): 10 గంటలపాటు నిర్విరామ నృత్య ప్రదర్శనలతో కర్నూలు కళాకారులు రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా నందమూరి తారక రామారావు నటించిన 101 సినిమాల్లోని 101 పాటలను ఎంచుకుని 101 మంది కళాకారులతో ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శన చేయించారు. ముందుగా పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ చింతలపట్ల వెంకటాచారి, సభ్యులు డాక్టర్ తాళ్లపాక సందీపకుమార్, కోఆర్డినేటర్ శ్రీదేవి ఈ ప్రదర్శనను తిలకించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు ప్రకటించారు. అనంతరం కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ముఖ్యఅతిథి బీవీరెడ్డి, నృత్య దర్శకులు కరీముల్లా కళాకారులకు ప్రశంసా పత్రంతో పాటు రికార్డు పత్రాన్ని అందజేసి సత్కరించారు.


నృత్యం చేస్తున్న కళాకారులు

వృద్ధులకు గుండె ఆపరేషన్లు విజయవంతం

- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స

కర్నూలు(హాస్పిటల్): వారిద్దరూ పేదవారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి గుండెలో సమస్య రావడంతో పలు ప్రైవేటు ఆసుపత్రులు తిరిగారు. గుండెలో సమస్య క్లిష్టమైనది కావడంతో పాటు ఇద్దరూ వృద్ధులు కావడంతో ఆపరేషన్ చేయడానికి అక్కడి వైద్యులు నిరాకరించారు. దీంతో వారిద్దరూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సల విభాగానికి వచ్చారు. వారిని కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి పరిశీలించి విజయవంతంగా ఆపరేషన్ చేశారు. అది కూడా రూపాయి ఖర్చు లేకుండా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఉచితంగా నిర్వహించారు. వివరాలను ఆదివారం డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి మీడియాకు వివరించారు. 'గూడూరు మండలం ఖానాపురం గ్రామంలో నివసిస్తున్న క్రిష్టన్న(73)కు గుండెనొప్పి వచ్చింది. కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(60)కి సైతం గుండెలో సమస్య రావడంతో ఆసుపత్రికి వచ్చింది. ఆయాసం, ఛాతినొప్పితో బాధపడుతున్న వీరిద్దరికీ యాంజియోగ్రామ్ పరీక్ష చేయగా గుండెకు వెళ్లే మూడు రక్తనాళాలు మూసుకుపోయాయి. అందులోనూ మూడు రక్తనాళాలు బ్లాక్స్‌క్రిటికల్‌గా ఉన్నాయి. బైపాస్ చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ వీలుగాని స్థితిలో ఉన్నాయి. మరోవైపు గుండె పనితనం కూడా తక్కువగా ఉంది. సాధారణంగా ఇలాంటి వారికి ఆపరేషన్ చేస్తే రిస్క్ అని మందులు వాడుకోవాలని డాక్టర్లు సూచిస్తారు. మేము ధైర్యం చేసి బీటింగ్ హార్ట్ పద్ధతిలో ఆపరేషన్ చేయాలని నిశ్చయించుకున్నాము. వారం రోజుల క్రితం బైపాస్ ఆపరేషన్ చేశాము. వారం రోజుల్లోనే వారు సులభంగా కోలుకున్నారు. గుండెనొప్పి, ఆయాసం తగ్గిపోవడం, లేచి నిలబడటం అంతా వారంలోనే జరిగింది. చాలా సార్లు బీటింగ్ హార్ట్ పద్ధతిలో ఆపరేషన్ కొంచెం కష్టమైనా ఫలితాలు బాగుంటాయి. ఇలాంటి ఆపరేషన్లు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్కువగా నిర్వహిస్తుంటాము' అని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు.


ఆపరేషన్లు చేసుకున్న క్రిష్టన్న, లక్ష్మీదేవి

సండే స్పెషల్

- వసతిగృహాల్లో ఆదివారం ప్రత్యేక మెనూ

వెల్దుర్తి: ఇదివరకు ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపేవారు కాదు. ఉడికీ ఉడకని అన్నం, నీళ్లచారు పెడతారని విమర్శ ఉండేది. ఇప్పుడు ఇంటి ఫుడ్‌ను తలపించేలా రుచికర ఆహారం అందజేస్తుండటంతో ఏ సంక్షేమ హాస్టళ్లు చూసినా పిల్లలతో కళకళలాడుతున్నాయి. వెల్దుర్తిలో ఎస్సీ బాలుర, బీసీ బాలికల హాస్టళ్లు ఉన్నాయి. ఆయా వసతిగృహాల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 545 మంది ఉన్నారు. వీరికి వారంలో మూడురోజులు చికెన్, ప్రతి రోజు ఉదయం అల్పాహారంతో పాటు పాలు, స్నాక్స్, సెలవు రోజుల్లో (ఆదివారం కాకుండా) మధ్యాహ్నం భోజనంలో అన్నం సాంబరు, గుడ్డు కూర, వారంలో ఆరుసార్లు ఉడకబెట్టిన గుడ్డు, రాత్రిపూట భోజనంతో పాటు అరటి పండు, మజ్జిగ అందజేస్తున్నారు. ఆదివారం మెనూ ప్రత్యేకంగా ఉంటుంది. విద్యార్థులకు ఉదయం అల్పాహారంగా పూరి, బటానీ కుర్మా, ఉడకబెట్టిన గుడ్డు, మధ్యాహ్నం చికెన్ బిర్యాని, రైతా, గోంగూర చెట్నీ, సాయంత్రం పాయసం, రాత్రి అన్నం, సాంబారు, పెసరపప్పు, మజ్జిగ అందజేస్తారు. రెండో ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు పలువురు తల్లిదండ్రులు హాస్టళ్లకు వచ్చారు. వడ్డిస్తున్న ఆహార పదార్థాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు.


ఉదయం అల్పాహారం పూరి, కుర్మా, గుడ్డు


తియ్యని పాయసం


వెల్దుర్తి ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులకు చికెన్ బిర్యాని వడ్డించిన దృశ్యం

రేషన్ బియ్యం తరలింపు ముఠా అరెస్ట్


రేషన్ బియ్యం వాహనాన్ని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామంలో ఆదివారం ఉదయం రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసే ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. రేషన్ బియ్యం సేకరణ, తరలింపునకు ప్రకాశం జిల్లాకు చెందిన దూదేకుల కాశీం అనే వ్యక్తి ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పల్లె వరప్రసాద్, కాటిపోగు శివప్రసాద్, దూదేకుల దర్గయ్యలను ముఠాగా ఏర్పాటు చేశాడు. వీరు సేకరించిన బియ్యాన్ని మార్కాపురం ప్రాంతంలో విక్రయించేందుకు వాహనంలో వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుబడ్డారు. వాహనంలో 50 కేజీల బస్తాలు 80 ప్యాకెట్లు లభ్యం కాగా నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వాహనాన్ని సీజ్ స్టేషన్‌కు తరలించారు. చాకచక్యంగా బియ్యం వాహనాన్ని పట్టుకున్నా కానిస్టేబుళ్లను ఎస్‌ఐ అభినందించారు.

డోన్‌లో రెండిళ్లలో చోరీ

డోన్ టౌన్: పట్టణంలోని కేవీఎస్ ఆసుపత్రి సమీపంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. యూనియన్ బ్యాంక్ సమీపంలోని గోబీ సెంటర్ నిర్వాహకుడు మహేష్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం శనివారం వెళ్లి రాత్రి అక్కడే బస చేశాడు. ఆదివారం ఉదయం ఇంటికి చేరకోగా ఇంటికి వేసిన తాళం పగుల గొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 20 తులాల వెండి సామాన్లు దోచుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. అలాగే అదే వీధికి చెందిన బాషా అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి అనంతపురంలో జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటి తాళం పగుల గొట్టి ఉండటంతో స్థానికులు గమనించి బాషాకు సమాచారం ఇచ్చారు. ఈ ఇంట్లో చోరీకి గురైన వాటి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ రెండు ఇళ్లలో చోరీ పాల్పడిందే ఒకరే ఉంటారని అనుమానం వ్యక్తమవుతోంది.